




# ప్రజా వాయిస్

/ PRAJA VOICE

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

సంపుటి: 01 | సంచిక: 274 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 16-04-2026 | పేజీలు: 6


## సిరా చుక్క

నమ్మకు ఎవరినీ..నమ్ముకో నిన్ను నువ్వు!
బంధాలన్నీ మాటలకే పరిమితం,
అనురాగాలన్నీ అవసరాలకే అంకితం..
అవకాశం కోసం ఎదురు చూసే
లోకమిది, అవసరం తీరాక
విసిరేసే కాలమిది!
అవసరం ఉన్నప్పుడు నువ్వే దేవుడివి,
నీ మాటే మంత్రం.నీ సాయమే జీవితం!
నీ మంచితనం వాళ్లకు వరంలా
కనిపిస్తుంది, నీ ఉనికే వాళ్లకు
ధైర్యంగా మారుతుంది.
కానీ అవసరం తీరాక నువ్వో
అపరిచితుడివి ,నీ విలువ వాళ్ల కళ్లలో
మసకబారిపోతుంది.
వాళ్ల తప్పులన్నీ "పరిస్థితి" అంటారు,
నీ నిజాయితీనే "బలహీనత" అంటారు!
వాళ్ల నవ్వుల వెనుక నకిలీ ముఖాలు,
వాళ్ల మాటల వెనుక మోసాల గంధాలు
నిన్ను వాడుకుని వదిలేయడమే వారి
విద్య, నిన్ను తగ్గించడమే వారి
విజయమని భావం!
అందుకే మిత్రమా.. గుండెను రాతిగా
చేసుకో, కళ్లను లక్ష్యంపై నిలిపి
ముందుకు నడిచిపో.పరుల మీద ఆశ
పెట్టుకోకు గుడ్డిగా, నీ మీద నీకు నమ్మకం
పెంచుకో గట్టిగా! ప్రపంచం మారుతుంది.
మాటలు మారుతాయి,కానీ నీ విలువ
ఎప్పటికీ తగ్గదు మిత్రమా! నిన్ను నువ్వు
నమ్ముకో..కొండంత అండగా

-: నడ్డి శివకృష్ణ యాదవ్..ప్రజా వాయిస్

# దేశ సభలో ప్రజా గొంతుక

- ఎలా అవుతారో తెలుసా?
- ఎంపీ ఎన్నిక, జీతభత్యాలు, సెక్యూరిటీపై ప్రత్యేక విశ్లేషణ
- భారత రాజ్యాంగం కల్పించిన అధికారాలు
- బాధ్యతలు ఇవే!

**ప్రజా వాయిస్, ప్రత్యేకం :** దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో అడుగుపెట్టడం అనేది ప్రతి రాజకీయ నాయకుడి కల. కానీ, ఒక సామాన్యుడు ఎంపీ (Member of Parliament) కావాలంటే రాజ్యాంగం నిర్దేశించిన నిబంధనలు ఏమిటి? వారికి ప్రభుత్వం ఇచ్చే జీతం ఎంత? వారికి ఉండే భద్రత ఏమిటి? అనే ఆసక్తికర అంశాలు 'ప్రజా వాయిస్' పాఠకుల కోసం..

**ఎంపీ అంటే ఎవరు? ఎలా ఎన్నికవుతారు?**

భారత పార్లమెంటులో రెండు సభలు ఉంటాయి.1. లోక్‌సభ (దిగువ సభ): దీనిని 'ప్రజల సభ' అంటారు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రత్యక్షంగా ఓటు వేసి తమ ప్రతినిధిని ఎన్నుకుంటారు.

ఇక్కడ పోటీ చేయడానికి కనీసం 25 ఏళ్ల వయస్సు ఉండాలి.2. రాజ్యసభ (ఎగువ సభ): దీనిని 'రాష్ట్రాల మండలి' అంటారు. ఇక్కడి సభ్యులను ఎమ్మెల్యేలు (MLAs) ఎన్నుకుంటారు. ఇది పరోక్ష ఎన్నిక. ఇక్కడ పోటీ చేయడానికి కనీసం 30 ఏళ్ల వయస్సు ఉండాలి.



**చట్టసభలో ఎలా కూర్చుంటారు?**

(ప్రమాణ స్వీకారం)ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన ఒక వ్యక్తి సభ్యుడు అయిపోడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 99 ప్రకారం, రాష్ట్రపతి లేదా ఆయన నియమించిన వ్యక్తి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతే సభ్యుడిగా గుర్తింపు లభిస్తుంది. ఆ తర్వాతే సభలో కేటాయించిన

మిగతా 2లో

## రాఘవ్ చడ్డాకు జెడ్ ప్లస్ షాక్!

- భద్రతను ఉపసంహరించుకున్న పంజాబ్ సర్కార్
- సొంత పార్టీలోనే సెగ?
- రాజ్యసభ పదవి ఊడటం నుంచి సెక్యూరిటీ కోత వరకు
- వరుస ఎదురుదెబ్బలు

2లో

## మంత్రి అడ్లూరికి హైకోర్టు షాక్

- పాస్‌పోర్ట్ కావాలంటే NOC తప్పనిసరి!
- క్రిమినల్ కేసులు ఉంటే నిబంధనలు పాటించాల్సిందే
- ట్రయల్ కోర్టుకే కీలక అధికారం
- జస్టిస్ నాగేశ్ భీమపాక ఆదేశం.

2లో

## రైతుల పక్షాన కవిత పోరాటం



- పరిగి లో పరిశ్రమల పేరుతో బలవంతంగా భూములు లాక్కుంటారా..?
- భూ సేకరణ నోటిఫికేషన్ ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- వికారాబాద్ లో ఉద్రిక్తత నడుమ రైతులతో కలిసి నిరసన
- పాల్గొన్న డీఎస్పీ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్
- ఇరువురిని అరెస్టు చేసి బంటారం పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు

2లో

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సంచలనం
# తెరపైకి కేదార్ పేరు!

- పైలట్ రోహిత్ రెడ్డి సోదరుల నుంచి రూ. 25 లక్షల బదిలీ?
- దుబాయ్‌లో మరణించిన వ్యక్తితో ఆర్థిక లావాదేవీలు
- విచారణలో పొంతన లేని సమాధానాలు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో ప్రతిరోజూ ఆసక్తికరమైన, విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో తాజా దర్యాప్తులో 'కేదార్' అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**బ్యాంక్ ఖాతాల్లో భారీ లావాదేవీలు**

పోలీసుల లోతైన విచారణలో రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి మరియు కేదార్ మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పక్కా ఆధారాలు లభించాయి. రోహిత్, రితేష్‌ల బ్యాంక్ ఖాతాల నుంచి కేదార్‌కు దాదాపు రూ. 25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సొమ్ము ఎందుకు పంపారు? దీని వెనుక డ్రగ్స్ నెట్‌వర్క్ ఉందా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.



**విచారణకు సహకరించని సోదరులు**

ఈ ఆర్థిక లావాదేవీల గురించి పోలీసులు ప్రశ్నించగా, రోహిత్ రెడ్డి మరియు రితేష్ రెడ్డి ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు సమాచారం. నిందితులు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదు. అడిగిన ప్రశ్నలకు పొంతన లేకుండా సమాధానాలు దాటవేస్తున్నారు. అసలు నిజాన్ని రాబట్టడానికి వీరిని మరికొన్ని రోజులు పోలీసు కస్టడీకి అప్పగించాల్సిన

మిగతా 2లో

## రోడ్డుపై నిర్లక్ష్యం.. ప్రాణాలకు శిక్ష!



- నల్లగొండలో రహదారి భద్రత ఉద్యమానికి శ్రీకారం
- "క్షేమంగా గమ్యం చేరాలి" కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పోలీస్ అధిపతి శివధర్ రెడ్డి
- హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి
- 2000 మందికి హెల్మెట్లు పంపిణీ

2లో

# శత్రువు గుండెల్లోకి వెళ్లైనా మన పైలట్‌ను తెచ్చుకుందాం!

- అమెరికా CSAR తరహాలో భారత్ ప్లే-బుక్ వ్యూహం
- పాక్ వెన్నులో వణుకు..
- గాలిలో రాఫేల్ పహారా..
- నేలపై గరుడ్ కమాండోల వేట!



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** యుద్ధరంగంలో శత్రువు విమానాన్ని కూల్చడం ఎంత ముఖ్యమో, ప్రమాదవశాత్తు శత్రు భూభాగంలో చిక్కుకున్న మన పైలట్‌ను సురక్షితంగా వెనక్కి తీసుకురావడం అంతకంటే ముఖ్యం.

2019లో అభినందన్ వర్ధమాన్ ఉదంతం తర్వాత భారత్ ఈ విషయంలో తన వ్యూహాలను సమూలంగా మార్చేసింది. తాజాగా ఇరాన్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానం పైలట్‌ను అమెరికా ఆర్మీ 'కంబాట్ సెర్చ్ అండ్ రెస్క్యూ (CSAR)' ఆపరేషన్ ద్వారా రక్షించిన తీరును స్ఫూర్తిగా తీసుకుంటూ.. టీమ్ ఇండియా తన సొంత 'ప్లే-బుక్' సిద్ధం చేసుకుంది.

**ఏమిటీ 'ప్లే-బుక్' వ్యూహం?**

ఒకవేళ భారత పైలట్ పాకిస్థాన్ వంటి శత్రు దేశ సరిహద్దుల్లో చిక్కుకుంటే, గంటల వ్యవధిలోనే భారత్ ఈ విధంగా స్పందిస్తుంది. పైలట్ పారాచూట్ ద్వారా దిగిన వెంటనే వారి వద్ద ఉండే అత్యాధునిక ఎమర్జెన్సీ రేడియో సిగ్నల్స్ ఆధారంగా వారి ఖచ్చితమైన లొకేషన్‌ను కంట్రోల్ రూమ్ గుర్తిస్తుంది.రెస్క్యూ హెలికాప్టర్లు అక్కడికి వెళ్లేటప్పుడు శత్రువు దాడులు చేయకుండా ఆకాశంలో రాఫేల్ లేదా సుఖోయ్-30 MKI యుద్ధ విమానాలు గస్తీ కాస్తాయి. ఐఏఎఫ్ (IAF) కు చెందిన అత్యంత

మిగతా 2లో

# పాకిస్థాన్‌కు సౌదీ బిలియన్ భరోసా!

- రూ. 25 వేల కోట్ల అదనపు సాయం
- ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పాక్‌కు ఊరట

**ఇస్లామాబాద్/వాషింగ్టన్:** తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌ను ఆదుకునేందుకు ఆప్త మిత్రుడు సౌదీ అరేబియా మరోసారి ముందుకొచ్చింది. విదేశీ మారక నిల్వలు అట్టడుగుకు చేరి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన పాక్‌కు 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 25,200 కోట్లు) అదనపు ఆర్థిక సాయం అందించేందుకు సౌదీ అంగీకరించింది.

**వారంలోనే నిధుల విడుదల**

వాషింగ్టన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF), ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా పాక్ ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్, సౌదీ అధికారుల మధ్య ఈ కీలక ఒప్పందం కుదిరింది. రాబోయే వారం రోజుల్లోనే ఈ నిధులు పాక్ ఖజానాకు చేరనున్నట్లు ఆ దేశ ఆర్థిక శాఖ వెల్లడించింది.



**సౌదీ అందించిన ప్రధాన ఊరటలు:-**

తక్షణ అవసరాల కోసం $3 బిలియన్ల నగదు జమ.- గతంలో తీసుకున్న $5 బిలియన్ల రుణ ఒప్పందాన్ని ప్రతి ఏటా పునరుద్ధరించాల్సి ఉండగా, తాజాగా ఆ గడువును ఒకేసారి మూడేళ్లకు పొడిగిస్తూ సౌదీ నిర్ణయం తీసుకుంది.- ఈ నిధులతో పాకిస్థాన్ విదేశీ మారక నిల్వలు మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో దేశ పరపతి

మిగతా 2లో

## మార్కెట్ యార్డుల్లో జీరో బిజినెస్ సాగనివ్వం

- నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వేటు
- ట్రేడర్ల లైసెన్సులు రద్దు!-
- రూ. 568 కోట్లతో మార్కెట్ల ఆధునీకరణ
- జూలై కల్లా సోలార్ వెలుగులు..
- మంత్రి తుమ్మల

2లో



# రైతుల పక్షాన కవిత పోరాటం

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా పరిగి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో స్థానిక రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రైతుల పక్షాన పోరాటానికి దిగారు. బుధవారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆమె పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల స్థాపన అనే సాకుతో రైతుల పొట్ట కొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి నియోజకవర్గం లో సాగు భూములను పరిశ్రమల కోసం సేకరించాలనుకోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు.అనువంశికంగా తాతల కాలం నాటి భూములను నమ్ముకొని బ్రతుకుదెరువు సాగిస్తున్న రైతులను రోడ్డున పడేయాలని చూడటం దుర్మార్గమని, తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయింపు**

వికారాబాద్ ఆర్డిఓ కార్యాలయం వద్దకు వందలాది మంది రైతులు చేరుకొని రోడ్డుపై బైఠాయించగా రైతులతో కలిసి కవిత ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భూసేకరణ ప్రక్రియను వెంటనే ఆపకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పరిగి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం సాగు భూముల సేకరణను నిలిపివేయాలి. రైతుల సమ్మతి లేకుండా ఒక్క సెంటు భూమిని కూడా తీసుకోవడానికి వీల్లేదు.

బలవంతపు భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక నాయకులు భారీ సంఖ్యలో రైతులు జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. కవిత రాకతో పరిసరాలు భారీగా పోలీసులు మోహరించారు. అక్కడి నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీగా తరలివచ్చి రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.దీంతో కవితను,డీఎస్పీ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజును అరెస్టు చేసి ధరూర్ పోలీస్ స్టేషన్ కు తరలించి అక్కడినుండి బంటారంకు తరలించారు.

# రోడ్డుపై నిర్లక్ష్యం.. ప్రాణాలకు శిక్ష!

**ప్రజా వాయిస్ క్రైమ్ , నల్గొండ** రహదారిపై నిర్లక్ష్యం ప్రాణాంతకమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధిపతి శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "క్షేమంగా గమ్యం చేరాలి" రహదారి భద్రత అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం నల్లగొండ జిల్లాకు వచ్చిన ఆయన, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.చిట్యాల మండలం వెలిమినేడు వద్ద జాతీయ రహదారిపై "నీ వాహనం వేగంగా వెళ్తుంది.. కానీ నీ జీవితం ఆగిపోతుంది" అనే హెచ్చరిక నినాదంతో ప్రమాదానికి గురైన కారును ప్రదర్శిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డును రాష్ట్ర పోలీస్ అధిపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ పోలీస్ అధికారి ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్ పాల్గొన్నారు.తదుపరి నకిరేకల్ పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి నియమాలు, హెల్మెట్ ప్రాధాన్యం, సీటు బెల్టు అవసరం, వేగ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే నియమాలు పాటిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా మారతారని సూచించారు.అనంతరం నకిరేకల్ మినీ క్రీడామైదానంలో నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సభలో జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, పాల ఉత్పత్తి అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గుత్త అమిత్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల శ్యాముల్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్ తదితరులు పాల్గొన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు కట్టుకోవాలని సూచించారు. వాహనంలో వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాలో అండర్‌పాస్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపితే ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు.రాష్ట్ర పోలీస్ అధిపతి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యల కంటే రహదారి ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సుమారు 800 మంది హత్యల్లో మరణిస్తే, రహదారి ప్రమాదాల్లో 7500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో హత్యల కారణంగా 24 మంది




మరణిస్తే, రహదారి ప్రమాదాల్లో 325 మంది మరణిస్తున్నారని వివరించారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల పట్ల ప్రజల్లో ఆందోళన ఉందని తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాలు తగ్గాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 2000 మందికి హెల్మెట్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 40 మంది గ్రామ సర్పంచ్లు తమ గ్రామాల్లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపనివ్వమని తీర్మానాలు చేసి వాటిని మంత్రికి అందజేశారు.ప్రమాదం నుంచి ప్రాణాపాయం తప్పించుకున్న వ్యక్తి తన అనుభవాన్ని పంచుకుంటూ హెల్మెట్ వాడటం వల్లే తాను సురక్షితంగా ఉన్నానని తెలిపాడు. ప్రమాద సమయంలో వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వెంకన్న అనే వ్యక్తికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరి చేత రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారి రమేష్, ఉప పోలీసు అధికారులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.a

# మార్కెట్ యార్డుల్లో జీరో బిజినెస్ సాగనివ్వం

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలోని వ్యవసాయ మార్కెట్ యార్డులను రైతులకు దేవాలయాలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమగ్ర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మార్కెట్లలో పారదర్శకత లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు.

**అభివృద్ధి పనులపై డ్యాష్‌బోర్డ్..**

రాష్ట్రవ్యాప్తంగా గత రెండేళ్లలో రూ. 568.50 కోట్లతో చేపట్టిన 630 అభివృద్ధి పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు.ప్రస్తుతం రూ. 128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని అధికారులు తెలపగా, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా 'డ్యాష్‌బోర్డ్' ఏర్పాటు చేయాలని సూచించారు.

**జీరో బిజినెస్‌పై ఉక్కుపాదం!**

మార్కెట్ యార్డుల్లో లైసెన్సులు పొంది వ్యాపారం చేయకుండా అక్రమాలకు పాల్పడే 'జీరో బిజినెస్' ట్రేడర్లపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వ్యాపారం చేయని ట్రేడర్ల లైసెన్సులను వెంటనే రద్దు చేయండి. అక్రమార్కులకు సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవు అని ఆయన ఘాటుగా హెచ్చరించారు. డిజిటలైజేషన్ ద్వారా ఈ సమస్యను అరికట్టేందుకు గడ్డిఅన్నారంలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.రైతుల ఉత్పత్తులకు రక్షణ కల్పించడంతో పాటు మార్కెట్ యార్డులను పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# దేశ సభలో ప్రజా గొంతుక


**మొదటి పేజీ తరువాయి**


సీటులో కూర్చునే అధికారం వస్తుంది.

**జీతభత్యాలు.. ఇతర సదుపాయాలు**

ఎంపీల జీతభత్యాలను 'ఎంపీల జీతభత్యాలు, పెన్షన్ చట్టం–1954' ప్రకారం నిర్ణయిస్తారు.–మూల వేతనం: నెలకు సుమారు రూ. 1,00,000.–నియోజకవర్గ అలవెన్స్: నెలకు రూ. 70,000 (నియోజకవర్గ పనుల కోసం).–ఆఫీస్ ఖర్చులు: నెలకు రూ. 60,000 (సిబ్బంది, స్టేషనరీ కోసం).–రోజువారీ భత్యం: పార్లమెంట్ సమావేశాలు ఉన్నప్పుడు రోజుకు రూ. 2,000 అదనంగా ఇస్తారు.–ఉచితాలు: ఉచిత నివాసం (ఢిల్లీలో), సంవత్సరానికి 50,000 యూనిట్ల విద్యుత్, ఉచితంగా ఫోన్ సౌకర్యం, రైలు మరియు విమాన ప్రయాణాల్లో రాయితీలు ఉంటాయి.

**సెక్యూరిటీ (భద్రత) ఎలా ఉంటుంది?**

ఎంపీలందరికీ ఒకే రకమైన భద్రత ఉండదు. వారికి ఉండే ముప్పు (Threat Perception) ఆధారంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భద్రతను నిర్ణయిస్తుంది.సాధారణ భద్రత: ప్రతి ఎంపీకి సాధారణంగా ఢిల్లీ పోలీసుల నుంచి లేదా స్థానిక పోలీసుల నుంచి తక్కువ స్థాయి భద్రత ఉంటుంది.కేటగిరీ భద్రత: కేంద్ర మంత్రులు లేదా ప్రాణహాని ఉన్న ఎంపీలకు వారి హోదాను బట్టి X, Y, Y+,



Z లేదా Z+ కేటగిరీ భద్రత కల్పిస్తారు. ఇందులో సీఐఎస్ఎఫ్ (CISF) లేదా ఎన్ఎస్జీ (NSG) కమాండోలు ఉంటారు.

**అనర్హత ఎప్పుడు?**

ఒక ఎంపీ ఏదైనా నేరంలో 2 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష అనుభవిస్తే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం వారి సభ్యత్వం రద్దవుతుంది.ఒక ఎంపీ కేవలం చట్టాలు చేసే వ్యక్తి మాత్రమే కాదు, లక్షలాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం. అందుకే రాజ్యాంగం వారికి ప్రత్యేక హక్కులతో పాటు భారీ బాధ్యతలను కూడా అప్పగించింది.

# పాకిస్థాన్‌కు సౌదీ బిలియన్ భరోసా!


**మొదటి పేజీ తరువాయి**


కొంత మేర పెరిగే అవకాశం ఉంది.

**గండం గట్టెక్కినట్లేనా?**

ప్రస్తుతం పాకిస్థాన్ పీకల్లోతు కష్టాల్లో ఉంది. ఈ నెలలోనే యూఏఈ (UAE) కి చెల్లించాల్సిన 3.5 బిలియన్ డాలర్ల పాత అప్పు గడువు ముగియనుంది. ఒకవేళ సౌదీ నుంచి ఈ సాయం అందకపోయి ఉంటే పాక్ డిఫాల్టర్ (దివాళా తీసిన దేశం) గా మిగిలిపోయే ప్రమాదం ఉండేది. ప్రస్తుతం పాకిస్థాన్ కేవలం సౌదీపైనే కాకుండా, ఐఎంఎఫ్ నుంచి మరిన్ని రుణ ప్యాకేజీల కోసం చర్చలు జరుపుతోంది. పొరుగు దేశం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్న తరుణంలో ఈ 'సౌదీ సాయం' ఒక తాత్కాలిక ఊపిరిగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# మంత్రి అడ్లూరికి హైకోర్టు షాక్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై ఉన్న క్రిమినల్ కేసుల నేపథ్యంలో పాస్‌పోర్ట్ జారీకి అడ్డంకులు ఎదురవడంతో ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. పదవిలో ఉన్నా, సామాన్యులైనా చట్టం ముందు అందరూ సమానులేనని గుర్తు చేస్తూ.. నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని స్పష్టం చేసింది.

**పోలీసు నివేదికతో మొదలైన చిక్కులు**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తన పాస్‌పోర్ట్ పునరుద్ధరణ (Renewal) కోసం దరఖాస్తు చేసుకోగా, నిబంధనల ప్రకారం పోలీసు వెరిఫికేషన్ జరిగింది. అయితే, ఆయనపై పలు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు ప్రతికూల నివేదిక ఇవ్వడంతో పాస్‌పోర్ట్ అధికారులు దరఖాస్తును తిరస్కరించారు. దీనిని సవాలు చేస్తూ మంత్రి హైకోర్టును ఆశ్రయించారు.పెండింగ్ కేసులు ఉన్నప్పుడు పాస్‌పోర్ట్ పొందాలంటే సంబంధిత ట్రయల్ కోర్టుల నుంచి తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (NOC) తీసుకోవాలని జస్టిస్ నాగేశ్ భీమపాక స్పష్టం చేశారు.మంత్రి ముందుగా విచారణ కోర్టులలో దరఖాస్తు చేసుకుని ఎన్వోసీ పొందాలి. ఆ పత్రాన్ని పాస్‌పోర్ట్ అథారిటీకి సమర్పిస్తేనే వారు జారీ ప్రక్రియను పరిశీలిస్తారు.ఒకవేళ విదేశాలకు వెళ్లాల్సి వస్తే.. ప్రయాణ ఉద్దేశం, కాలపరిమితిని పేర్కొంటూ విడిగానే దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రమంలో ట్రయల్ కోర్టులు విచక్షణ మేరకు షరతులు విధించవచ్చు.కోర్టు విధించిన షరతులను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునే పూర్తి స్వేచ్ఛ ట్రయల్ కోర్టులకు ఉంటుందని హైకోర్టు వెల్లడించింది.

**చట్టం ముందు అందరూ సమానులే!**

ఈ తీర్పు ద్వారా హైకోర్టు ఒక బలమైన సందేశాన్ని పంపింది. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు కూడా న్యాయపరమైన నిబంధనలను పాటించాల్సిందేనని, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఏ స్థాయి వ్యక్తికైనా సాధారణ నిబంధనలే వర్తిస్తాయని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఇప్పుడు మంత్రి అడ్లూరి తదుపరి చర్యల కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాల్సి ఉంది.

# రాఘవ్ చడ్డాకు జెడ్ ప్లస్ షాక్!

**న్యూఢిల్లీ/చండీగఢ్, ప్రజా వాయిస్:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఫైర్‌బ్రాండ్ నాయకుడు, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దాకు ఊహించని షాక్ తగిలింది. పంజాబ్ ప్రభుత్వం ఆయనకు కల్పించిన 'జెడ్ ప్లస్' (Z+) కేటగిరీ భద్రతను అకస్మాత్తుగా ఉపసంహరించుకోవడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. అయితే, ఆయనకు కేంద్ర ప్రభుత్వం నుంచి మళ్లీ అదే స్థాయి భద్రత లభించే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.



**సొంత గూటిలోనే అసమ్మతి రాగం?**

చడ్డా భద్రత తగ్గింపు వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో గట్టిగా వినిపించడంలో ఆయన విఫలమయ్యారని 'ఆప్' అంతర్గత వర్గాల నుంచే విమర్శలు వస్తున్నాయి.ఇటీవల రాజ్యసభలో ఆప్ ఉపనాయకుడి పదవి నుంచి చడ్డాను తొలగించి, ఆయన స్థానంలో అశోక్ మిట్టల్ను నియమించడం చర్చకు దారితీసింది. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడటంలో చడ్డా వెనుకంజ వేస్తున్నారని పార్టీ భావిస్తుండగా.. "నా గళాన్ని అణచివేయవచ్చు కానీ, నన్ను ఓడించలేరు" అంటూ చడ్డా అప్పట్లో ఘాటుగా స్పందించారు.

**పర్సనల్ లైఫ్ వర్సెస్ పొలిటికల్ లైఫ్**

రాజకీయాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ, రాఘవ్ చడ్డా వ్యక్తిగత జీవితం మాత్రం నిత్యం వెలుగులోనే ఉంటోంది. 2023లో బాలీవుడ్ నటి పరిణీతి చోప్రాను ఉదయ్‌పూర్‌లో అట్టహాసంగా వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత ఈ జంట తమ ట్రావెల్ డైరీస్, ఫ్యామిలీ మూమెంట్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

**వరుస పరిణామాల వెనుక మర్మమేంటి?**

ఒకప్పుడు కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తుడిగా, పార్టీలో నంబర్–2 గా చలామణి అయిన రాఘవ్ చడ్డాకు వరుసగా షాకులు తగలడం వెనుక 'ఆప్' హైకమాండ్ వ్యూహమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. భద్రత తొలగింపు వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజం.. కానీ ఒక ఎంపీకి ఉన్న భద్రతను సొంత రాష్ట్ర ప్రభుత్వమే తొలగించడం వెనుక పెద్ద రాజకీయ మర్మమే ఉండి ఉంటుంది.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సంచలనం

## తెరపైకి కేదార్ పేరు!


**మొదటి పేజీ తరువాయి**


అవసరం ఉంది, అని పోలీసులు తమ పిటిషన్‌లో స్పష్టం చేశారు.

**దుబాయ్ లింకుపై ఆరా..**

డ్రగ్స్ ఓవర్ డోస్‌తో మరణించిన కేదార్‌తో వీరికి ఉన్న సంబంధం కేవలం స్నేహమేనా లేక అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఉన్న ఇతర నిందితుల కాల్ డేటాను కూడా విశ్లేషిస్తున్న పోలీసులు, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు.



# శత్రువు గుండెల్లోకి వెళ్లైనా మన పైలట్‌ను తెచ్చుకుందాం!


**మొదటి పేజీ తరువాయి**


శక్తివంతమైన 'గరుడ్ కమాండోలు' రంగంలోకి దిగి శత్రువుల కళ్లుగప్పి పైలట్‌ను రక్షిస్తారు.

**భారత్ వద్ద ఉన్న 'బ్రహ్మాస్త్రాలు':**

అమెరికా తరహా హంట్ అండ్ రెస్క్యూ కోసం భారత్ తన రక్షణ వ్యవస్థను ఆధునీకరించింది. ఎత్తైన పర్వత ప్రాంతాల్లోనూ వేగంగా ప్రయాణించే స్వదేశీ లైట్ కాంబాట్ హెలికాప్టర్. రాత్రీపూట కూడా శత్రువులకు చిక్కకుండా ఆపరేషన్లను పూర్తి చేయగల సామర్థ్యం వీటి సొంతం. కమాండోలను శత్రు సరిహద్దులకు అత్యంత వేగంగా చేరవేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

**ముగిసిన 'ఆపరేషన్ సింధూర్'.. రేపటి ముప్పుకు సిద్ధం!**

గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' మన సైనిక పటిమను చాటిచెప్పింది. అయితే, భవిష్యత్తులో పాక్ నుంచి ఎదురయ్యే ముప్పును దృష్టిలో పెట్టుకుని, ఒకవేళ మన పైలట్ శత్రువు చెరలో చిక్కుకున్నా.. దౌత్యపరమైన చర్చల కోసం వేచి చూడకుండా, సైనిక శక్తితో వారిని రక్షించుకునే స్థాయికి భారత్ చేరుకుంది. మారిన యుద్ధ రంగ పరిస్థితుల్లో ఒక పైలట్ విలువ కేవలం ఒక విమానం విలువతో సమానం కాదు.. దేశ గౌరవంతో సమానం. అందుకే అమెరికా స్థాయి రెస్క్యూ సామర్థ్యాలను భారత్ అందిపుచ్చుకుంటోంది.

# గురువు కాదు.. గూండా.. బాబా కాదు.. బకాసురుడు!

- హెడ్ మాస్టర్ ముసుగులో కామపిశాచి వికృత చేష్టలు
- పిల్లలకు అశ్లీల చిత్రాల పై పోక్సో
- మహిళలతో అసభ్యత
- రూ. 10 లక్షల పూజల మోసం!

**మహబూబాబాద్ (రాజోలు), ప్రజా వాయిస్:** సమాజానికి వెలుగునివ్వాల్సిన గురుతర వృత్తిలో ఉండి.. పైశాచికత్వానికి పరాకాష్ఠగా మారాడు ఆ హెడ్ మాస్టర్. ఒకవైపు పాఠశాల విద్యార్థులపై అఘాయిత్యాలు, మరోవైపు బాబా అవతారమెత్తి మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, ఇంకోవైపు పూజల పేరుతో లక్షల రూపాయల వసూళ్లు.. ఇలా ఒకటేమిటి, ఆ కామాంధుడి పాపాల చిట్టా వింటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఎట్టకేలకు మహబూబాబాద్ జిల్లా రాజోలు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ జాడ్పోడ్ ప్రతాప్ చీకటి లీలలను పోలీసులు బట్టబయలు చేశారు.

**హెడ్ మాస్టర్ చీకటి చరిత్ర..**

ప్రతాప్ ట్రాక్ రికార్డు చూసి పోలీసులే అవాక్కయ్యారు. గతంలో కట్టెలమండి స్కూల్‌లో హెడ్ మాస్టర్‌గా పనిచేసినప్పుడు. చిన్న పిల్లలకు అశ్లీల చిత్రాలు (Pornography) చూపించి, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో (POCSO) చట్టం కింద అరెస్టయి జైలుకు



వెళ్లొచ్చాడు. జైలు నుంచి వచ్చాక విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో, రాజోలు స్కూల్ హెడ్ మాస్టర్‌గా మళ్లీ బాధ్యతలు చేపట్టి తన వికృత చేష్టలను కొనసాగించాడు.

**బాబా అవతారం.. భక్తి ముసుగులో భయంకర కామం!**

జైలు నుంచి వచ్చాక తన రూట్ మార్చిన ప్రతాప్.. భోగిలా కాకుండా 'యోగి'లా అవతారమెత్తాడు. పూజల పేరుతో మహిళలను నమ్మించి, వారిని అసభ్యంగా తాకుతూ వికృత చేష్టలకు పాల్పడేవాడు. భక్తి ముసుగులో భయాన్ని ఆసరాగా చేసుకుని అతను చేస్తున్న అకృత్యాలను, పక్కనే ఉన్న పురుషులు కూడా మూఢనమ్మకంతో విగ్రహాల్లా చూస్తూ ఉండిపోవడం గమనార్హం.చిన్నపిల్లల మొహాలపై బూడిద చల్లుతూ, వారు భయంతో విలవిల్లాడుతున్నా వదలకుండా వింత చేష్టలతో వేధించేవాడు.

**రూ. 10 లక్షల బురిడీ.. ఫ్లాట్ కొనుగోలు!**

స్టేషన్ గుండ్రాతి మడుగుకు చెందిన తునగర్ నాగేశ్వరరావు అనే వ్యక్తిని నమ్మించిన ఈ 'మాయ' బాబా.. దోష నివారణ పూజల పేరుతో ఏకంగా రూ. 10 లక్షలు వసూలు చేశాడు. ఆ డబ్బును విరాళంగా ప్రకటిస్తే ఇంకా పుణ్యం వస్తుందని నమ్మించి ఒక ఒప్పందం కూడా చేసుకున్నాడు. తీరా ఆ డబ్బుతో ఖమ్మంలో ఒక ఖరీదైన ఫ్లాట్ కొనుగోలు చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు కురవి పోలీసులను ఆశ్రయించడంతో ఈ కిలాడీ హెడ్ మాస్టర్ గుట్టు రట్టయింది.


భక్తి పేరుతో మోసగించే ఇలాంటి కామపిశాచులను నమ్మకండి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన హెడ్ మాస్టరే ఇలాంటి అకృత్యాలకు పాల్పడటం సమాజానికే సిగ్గుచేటు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అతడిని సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించాలి. ప్రస్తుతం పోలీసులు ప్రతాప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వార్త ఇప్పుడు జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతోంది.

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో తీరని విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఏఐసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ దుర్మరణం
- బట్టి విక్రమార్క ముఖ్య అనుచరుడు జావేద్ మృతి
- పలువురి సంతాపం



**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా రాజకీయాల్లో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన అంకితభావం గల నాయకుడు, ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఏఐసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ (52) బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మోతే వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త తెలియగానే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి.మహమ్మద్ జావేద్ ప్రస్థానం ఒక సామాన్య కార్యకర్తకు స్ఫూర్తిదాయకం. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్యాభ్యాసం వరకు అంతా నేలకొండపల్లి లోనే సాగింది. నేలకొండపల్లి మట్టిలో పుట్టి ఢిల్లీ స్థాయికి ఎదిగినా తన ఊరితో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉండేది.విద్యార్థి దశలోనే ఎన్ఎస్యూఐ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. సామాన్య కార్యకర్త స్థాయి నుండి అంచలంచెలుగా ఎదుగుతూ, సుమారు ఏడేళ్ల పాటు ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు.అధిష్టానం అప్పగించిన ప్రతి పనిని చిత్తశుద్ధితో నెరవేర్చే క్రమశిక్షణ గల నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ, ఆయనను పీసీసీ సభ్యుడిగా మరియు అత్యున్నతమైన ఏఐసీసీ సభ్యుడిగా నియమించింది.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు జావేద్ అత్యంత ఆప్తుడు. రాజకీయంగా భట్టి విక్రమార్కకు అన్ని వేళలా చేదోడు వాదోడుగా ఉంటూ, జిల్లా రాజకీయాల్లో బట్టి మనిషిగా గుర్తింపు పొందారు. భట్టి విక్రమార్క పాదయాత్ర నుండి మొన్నటి ఎన్నికల వరకు ప్రతి అడుగులోనూ జావేద్ కీలక పాత్ర పోషించారు. గత శాసన సభ ఎన్నికల్లో ఖమ్మం నుండి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రచారం జరగటం చివరి క్షణంలో సమీకరణాల దృష్ట్యా ఆ స్థానాన్ని తుమ్మల నాగేశ్వరరావుకు ఇచ్చినా నిబద్ధతతో, పార్టీ మాటకు కట్టుబడి ఉన్న నాయకుడిగా గుర్తింపు ఉంది.జావేద్ మృతి పట్ల రాష్ట్ర మంత్రులు, వివిధ పార్టీల నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జావేద్ మరణం తమను తీవ్రంగా కలచివేసిందని. ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, పార్టీ కోసం నిరంతరం శ్రమించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు. జావేద్ మరణం జిల్లా కాంగ్రెస్‌కు వ్యక్తిగతంగా తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, బీజేపీ జిల్లా నేత నున్న రవి, సీపీఎం నేత ఏటుకూరి రామారావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య తదితరులు జావేద్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించే గుణం, కార్యకర్తలకు అండగా ఉండే తత్వం కలిగిన జావేద్ మరణం ఖమ్మం నగర రాజకీయాల్లో ఒక శూన్యాన్ని మిగిల్చింది. సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి, జాతీయ స్థాయి పదవులను అలంకరించినా, చివరి వరకు నేలకొండపల్లి బిడ్డగానే సామాన్యులకు అందుబాటులో ఉన్న మహమ్మద్ జావేద్ కు 'ప్రజా వాయిస్' అశ్రుతర్పణం ఘటిస్తోంది.



## పట్టణ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

- అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం
- బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి.

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ సమన్వయంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పాదాలు కడిగి వారికి గౌరవం తెలియజేశారు.ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలను గుర్తించి అంబేద్కర్ జయంతి సందర్భంగా సత్కరించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కాసెగోని నిర్మల, మన్ కీ బాత్ కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీపీ కునారపు రేణుక దేవి,పుచ్చకాయల హనుమంతరెడ్డి, ఎనగందుల ఎల్లయ్య, కోట నాగేశ్వర్, లంక శంకర్, బందారి లత, మల్క భాగ్యలక్ష్మి, ఎర్రం సంతోష్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్, ఆగండ్ల గట్టయ్య, మాటూరి వెంకటస్వామి, గోస్కుల రవి, శాలిగంటి కొమురయ్య, దాసరి చందు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా**ప్రజల ప్రాణ రక్షణకు రోడ్డు భద్రతా నియమాల అమలు అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నాగవరం రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీవో)లో ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన కంటి పరీక్ష శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమాలను నిర్దేశించిన ప్రణాళికా ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు రోడ్డు నియమాల అమలు అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి టీ ఓ మానస, సంబంధిత అధికారులు, రవాణా శాఖ సిబ్బంది మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- విద్యుత్ కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- .కాకులమర్రి లక్ష్మణ్ బాబు.
- బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు

**.ప్రజా వాయిస్; ములుగు జిల్లా./** ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో విద్యుత్ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా వారికి మద్దతు తెలిపి వారి సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు విద్యుత్ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీలు ఇచ్చి నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పైగా అధికారులతో బెదిరించి విధులలో చేరాలని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరించడం సరైనది కాదని ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యుత్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోరిక గోవింద నాయక్, తాటి కృష్ణ, కొమరం ధనలక్ష్మి, కాకులమర్రి ప్రదీప్ రావు, బైకాని సాగర్, కోళ్ల వెంకన్న, చిట్టమల్ల సమ్మయ్య, సిద్దంశెట్టి లక్ష్మణరావు, తాడేపల్లి రఘు, యలవర్తి శ్రీనివాస్ రావు, బల్గూరి నవీన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు
- దుబ్బాక సిఐ రాజేష్

**దుబ్బాక, ప్రజా వాయిస్** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు రహదారి భద్రతా ప్రమాణాలను ప్రతి ఒక్కరూ పాటించే విధంగా చేయడమే ప్రభుత్వం తీసుకువచ్చిన అరైవ్ – ఆలైవ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని దుబ్బాక సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.రాజేష్ తెలిపారు.ప్రజా పాలనా–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న అరైవ్–అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పోలీసుల ఆధ్వర్యంలో మూడవరోజు చిల్డ్రన్స్ రోడ్డు సేఫ్టీ డే(పిల్లల భద్రతా దినోత్సవం)ను నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులతో అంగడి బజార్ చౌరస్తా వద్ద మానవహారం ఏర్పాటుచేసి, రహదారి భద్రత ప్రతిజ్ఞను నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు శిరస్రాణం(హెల్మెట్), సీట్ బెల్ట్ వినియోగం, రహదారి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవన్నారు. సురక్షితమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తమవంతు బాధ్యతను పోషించాలన్నారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా సెల్ఫోన్ వాడుతూ వాహనాలు నడపడం వంటి పనులకు, వాహనదారులు, యువత దూరంగా ఉండాలని కోరారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని సందేశాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ గ్లోబల్ పాఠశాల, శ్రీవాణి విద్యాలయం, శ్రీ గాయత్రీ వివేకానంద విద్యాలయం, కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి పాఠశాల, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మత్స్యకారులకు శాపం గా జిల్లా మత్స్యశాఖ అధికారుల తీరు

- కాసుల కక్కుర్తి తో అనర్హులకు లబ్ధి
- ప్రభుత్వ ఆశయానికి గండి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారుల పనీతిరుతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని బహిరంగంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి... ప్రభుత్వానికి మత్స్యకారులకు మధ్య వర్తిగా పని చేయాల్సిన జిల్లా అధికారులు , ఫీల్డ్ ఆఫీసర్లు దళారులతో కలిసి చేతివాటం చుపించడముతో అనర్హులు సభ్యత్వాలు పొంది ప్రభుత్వ ఆశయానికి గండి కొడుతున్నారు..అవినీతి పై ఇటీవల వస్తున్న వరుస కథనాలపై ప్రజా వాయిస్ మత్స్యశాఖ అధికారిని వివరణ కోరగా గతంలో అవినీతి పై నో కామెంట్ అని మోహం చాటేయడం జిల్లా స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.. మత్స్యకారుల అభివృద్ధి కి కృషి చేయాల్సిన అధికారులు దళారుల కనుసన్నల్లో పనిచేస్తూ కాసులకు కక్కుర్తి పడుతూ అనర్హులకు సభ్యత్వాలు, చైర్మన్ పదవులు, ప్రభుత్వ పథకాలను పక్కదారి పత్తిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి...ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.







## కూతురుతో కలిసి హెల్మెట్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ డాక్టర్ శబరీష్

**.ప్రజావాయిస్ న్యూస్/ మహబూబాబాద్** వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలను పాటించి, హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ కోరారు. 'అరైవ్ అలైవ్' రహదారి ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ మరియు రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ద్విచక్ర వాహనాల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం, ఎస్పీ స్వయంగా తన కూతురుతో కలిసి హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించడానికి దోహదపడింది. ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో ఈ ర్యాలీ ద్వారా ఎస్పీ చాటిచెప్పారు.

## సంజయ్ 'వేషాలు'.. జువ్వాడి 'విషయాలు'!

- స్టేజీల మీద స్పీచ్‌లు
- ఆచరణలో దళితులపై అణచివేతలా?
- కోరుట్ల గడ్డపై రాజుకున్న రాజకీయ రణరంగం
- ఎమ్మెల్యే తీరును చీల్చిచెండాడిన కాంగ్రెస్ నేత జువ్వాడి కృష్ణారావు!

**నవగీతం కోరుట్ల:** కోరుట్ల రాజకీయాల్లో ఒక్కసారిగా సెగలు రేగాయి. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు నిప్పులు చెరిగారు. "స్టేజీ ఎక్కితే అంబేద్కర్ ఆశయాలు.. స్టేజీ దిగితే అహంకారపు పోకడలా?" అంటూ జువ్వాడి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారాయి. అంబేద్కర్ జయంతి వేళ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ ఫోజులిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కు, జువ్వాడి కృష్ణారావు సూటి ప్రశ్నలు సంధించారు. మొన్న మల్లాపూర్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం వేళ.. స్థానిక మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఒక దళిత మహిళ అని తెలిసి కూడా ఆమెకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కడం వెనుక ఉన్న అంతర్యం ఏంటని ప్రశ్నించారు. "నోటితో రాజ్యాంగం గురించి చెబుతూ.. చేతలతో దళితులను అవమానిస్తారా?" అంటూ ఎమ్మెల్యే ముఖానికి అద్దం పట్టారు. కేవలం ప్రజాప్రతినిధులనే కాదు, కనీసం ప్రభుత్వ అధికారులను కూడా గౌరవించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని జువ్వాడి ధ్వజమెత్తారు. అంబేద్కర్ జయంతి సాక్షిగా మున్సిపల్ కమిషనర్‌ను, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ హోదాలో ఉన్న తహసీల్దార్‌ను అవమానించడం ఎమ్మెల్యే అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అధికారులను పనిముట్లుగా చూస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న సంజయ్ వైఖరిపై జువ్వాడి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "స్టేజీల మీద నీతులు చెప్పడం కాదు సంజయ్ గారు.. ఆచరణలో దళితులకు, అధికారులకు గౌరవం ఇవ్వడం నేర్చుకోండి. మీ డ్రామాలు ఇక సాగవు" అంటూ జువ్వాడి హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే, కోరుట్ల ప్రజలు మీ అహంకారానికి తగిన గుణపాఠం చెబుతారని, రానున్న రోజుల్లో రాజకీయంగా మీకు చుక్కలు కనపడటం ఖాయమని జువ్వాడి కృష్ణారావు హెచ్చరికలు జారీ చేశారు.



## కొత్తగూడలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మ దహనం

**.ప్రజా వాయిస్ న్యూస్/ కొత్తగూడ** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కపై సోషల్ మీడియాలో. బహిరంగంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేసి, బిఆర్ఎస్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులపై విరుచుకుపడ్డారు."ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న మంత్రి సీతక్కపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ రెడ్ కో చైర్మన్ సతీష్ రెడ్డి, బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్చార్జి క్రిశాంక్ కావాలనే బురదజల్లుతున్నారు. ఓటమి భయంతోనే బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతాం." ప్రజల్లో ఆదరణ పొందుతున్న మంత్రి సీతక్క మనోభావాల ను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే బిఆర్ఎస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య,తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి మాజీ ఎంపీపీ బానోతు విజయ రూప్సింగ్ మాజీ జెడ్పిటిసి పులుసం పుష్పలత అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ ఆదర్శ రైతు మండల అభ్యర్థులు గుమ్మడి సమ్మయ్య ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ఈరియా నాయక్, మరియు అన్ని గ్రామాల సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు



## హుస్నాబాద్‌లో "నో హెల్మెట్ - నో పెట్రోల్" విధానం అమల్లోకి

- ద్విచక్ర వాహనదారుల రక్షణే ధ్యేయం
- ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్

**ప్రజా వాయిస్ హుస్నాబాద్** :రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా హుస్నాబాద్ పట్టణ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో "నో హెల్మెట్ – నో పెట్రోల్" నిబంధనను పక్కాగా అమలు చేయాలని నిర్ణయించినట్లు హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి సంయుక్తంగా ప్రకటించారు.హెల్మెట్ ఉంటేనే పెట్రోల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్ పోయాలని బంకు నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సీసీ కెమెరాల నిఘా: బంకుల వద్ద నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు సీసీ టీవీ ఫుటేజీని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు.అవగాహన కార్యక్రమాలు: వాహనదారులు తమ ప్రాణాల రక్షణ కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు."చాలా ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయి. కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధనకు ప్రజలు, పెట్రోల్ బంకు నిర్వాహకులు సహకరించాలి."కఠిన చర్యలు తప్పవు నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై భారీ జరిమానాలు విధిస్తామని ఎస్ఐ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. పట్టణాన్ని ప్రమాద రహితంగా మార్చేందుకు పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానికుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.





## నేలకొండపల్లిలో విద్యార్థినులకు అగ్నిపరీక్ష!

- బాల్యంపై భానుడి ప్రతాపం
- చున్నీలే గొడుగులుగా విద్యార్థినుల నడక.
- అలసినా వీడని క్రమశిక్షణ
- ఎండలోనూ క్యూ కట్టిన విద్యార్థినులు.

**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలో ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఏప్రిల్ మధ్యలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం పది గంటలకే సూర్యుడు సెగలు గక్కుతుండటంతో బయటకు రావాలంటేనే సామాన్యులు గజగజ వణుకుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళ పాఠశాలలు ముగిసి ఇంటికి వెళ్లే క్రమంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.నేడు నేలకొండపల్లి పురవీధుల్లో చూసిన ఒక దృశ్యం ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి విద్యార్థినులు తమ చున్నీలను, టవళ్లను తలలపై కప్పుకుని వెళ్లాల్సిన దీన స్థితి ఏర్పడింది. కనీసం గొడుగులు కూడా లేని విద్యార్థులు ఈ వేడి గాలికి నీరసించి పోతూ అడుగులు వేస్తున్నారు. అటు చివర బడి.. ఇటు చివర హాస్టల్.. మధ్యలో సుమారు కిలోమీటర్ మేర సాగే ఈ మండుతున్న తారు రోడ్డు ఆ చిన్నారి పాదాలకు అగ్నిపరీక్ష పెడుతోంది.నడినెత్తిపై సూర్యుడు నిప్పులు చెరుగుతున్నా ఆ విద్యార్థుల క్రమశిక్షణ మాత్రం చెదరకపోవడం గమనార్హం. శరీరం అలసిపోతున్నా, కాళ్లు తడబడుతున్నా.. ఎండకు భయపడి చెల్లాచెదురుగా పరుగులు తీయకుండా, ఒకే వరుసలో అత్యంత పద్ధతిగా వెళ్తున్న ఆ దృశ్యం చూసేవారిని ఆలోచింపజేస్తోంది. వారిలోని ఈ సంస్కారం క్రమశిక్షణకు నిలువుటద్దంలా నిలిచింది. ప్రతి సందర్భంలో విద్యార్థులపై తనకున్న అనుబంధాన్ని చాటుకునే జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జయిని ఈ విషయంపై తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని, హాస్టల్ విద్యార్థులకు కనీసం రవాణా సౌకర్యం కల్పించాలని లేదా ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే వారిని హాస్టళ్లకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హుస్నాబాద్ లో చెత్త విభజనపై అవగాహన

- ప్లాస్టిక్ రహిత పట్టణమే లక్ష్యం!

**ప్రజా వాయిస్ హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో బుధవారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్ లక్ష్మిఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పాటించాల్సిన అంశాలను వివరించారు:ప్రతి ఇల్లు తమ చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలి. చెత్తను వేరు చేసే బాధ్యత ప్రాథమికంగా ప్రజలదేనని స్పష్టం చేశారు.పరిశుభ్రత: డ్రైనేజీల్లో చెత్త వేయకూడదని, నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకులను ప్రతి మూడేళ్లకు ఒకసారి శుభ్రం చేయించుకోవాలని, అనవసర వస్తువులను ఇతరులకు ఉపయోగపడేలా ఉంటే RRR సెంటర్లకు ఇవ్వాలని తెలిపారు.వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ మాట్లాడుతూ, ప్లాస్టిక్ ప్లేట్ల వాడకం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శుభకార్యాల్లో ప్లాస్టిక్‌కు బదులుగా మెప్మా ఆధ్వర్యంలోని స్టీల్ బ్యాంకులను వినియోగించుకోవాలని సూచించారు. కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ, తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసుకుని మొక్కలకు వాడాలని కోరారు. వార్డులోని మహిళలు ఒక్కొక్కరు పదిమందికి చెత్త విభజనపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, ఇన్చార్జి వార్డు ఆఫీసర్లు సతీష్, శ్రీకాంత్, వార్డ్ ఆర్పీ రజిత మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





## డ్డు భద్రతా నియమాలు పాటించి.. ప్రాణాలు కాపాడుకోవాలి

- మోహన్ రావు పేట ZPHSలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- అవగాహన కల్పించిన ఎస్.ఐ. చిరంజీవి

**ప్రజా వాయిస్, కోరుట్ల రూరల్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను నిబంధనల ప్రకారం పాటించాలని కోరుట్ల ఎస్.ఐ. చిరంజీవి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కోరుట్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మోహన్ రావు పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో బుధవారం 'అరైవ్ అలైవ్' (Arrive Alive) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.ఐ. చిరంజీవి ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రమాద సమయాల్లో ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. అదేవిధంగా కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం మర్చిపోకూడదన్నారు. కేవలం జరిమానాల కోసం కాకుండా, క్షేమంగా ఇంటికి చేరడం కోసమే నిబంధనలు పాటించాలని కోరారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తు కోసం చదువుపై దృష్టి పెట్టాలని ఎస్.ఐ. సూచించారు. సోషల్ మీడియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలని, ఇన్ స్టాగ్రామ్ వంటి వేదికల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకుని ప్రేమ పేరుతో ఇబ్బందుల్లో పడవద్దని హెచ్చరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లతిక నరేష్, ఎం.ఈ.ఓ. గంగుల నరేషం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల పోరాటానికి గౌరవం

**– వినయ్ మాదిగకు "దళిత రత్న" పురస్కారం**

**మల్కాజిగిరి15 ఏప్రిల్ (ప్రజా వాయిస్):** డాక్టర్ బాబా సాహెబ్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డును మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్. వినయ్ మాదిగ అందుకున్నారు.హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అంబేద్కర్ వారోత్సవాల్లో ఈ అవార్డు ప్రదానం జరిగింది. వికలాంగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న వినయ్ మాదిగ సేవలను గుర్తించి ఈ గౌరవం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్సి వర్గీకరణ మరియు సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని కూడా ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ అవార్డు సాధనలో సహకరించిన మల్కాజిగిరి ఎస్సి వెల్ఫేర్ అసోసియేషన్, ఎంఆర్పీఎస్ ప్రతినిధులకు వినయ్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు థిప్పరపు లక్ష్మణ్ మాదిగ, కనకరాజు మాదిగ, అంజి మాదిగ, మనోహర్ మాదిగతో పాటు అంబేద్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

- ఈ నెల 18న జరిగే తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయండి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్ శాయంపేట మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో శాయంపేట ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ కి తెలంగాణ ఉద్యమకారులకు ఉద్యమకారుల భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్ శాయంపేట మండల అధ్యక్షులు ఇమ్మిడి శెట్టి రవీందర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న 542 గల సర్వే నెంబర్ భూమిలో ఎనిమిది గుంటల ప్రభుత్వ స్థలం కలదు అట్టి స్థలంలో ఉద్యమకారులకు సమావేశం పరుచుకొనుటకు సమావేశం ఏర్పాటు చేసుకొనుట కొరకు కమ్యూనిటీ హాల్ భవనానికి స్థలం కేటాయించాలని మండల కేంద్రంలో 200 పైగా తెలంగాణ ఉద్యమకారులం ఉన్నామని తెలంగాణ తెచ్చిన మాకు కనీస గౌరవం లేకుండా పోతుందని మాకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసుకొనుటకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా ఈనెల 18వ తేదీన హైదరాబాదులో జరిగే ఉద్యమకారుల సదస్సును మండలంలోని ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గిద్ద మరి సురేష్ యూత్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల శివ మండల కోశాధికారి కానుగుల నాగరాజు బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ టి యు ఎఫ్ జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి గిద్దె మారి రామన్న రంగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దబండ బ్రిడ్జి వద్ద గుంతల పూడ్చివేత

### రోడ్డు భద్రత చర్యలు ఎస్ఐ సాగర్



**ప్రజా వాయిస్ సిర్పూర్ టి** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నుంచి కాగజ్‌నగర్ మార్గంలోని పెద్దబండ రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా మారిన గుంతలను ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో మట్టితో పూడ్చారు. కానిస్టేబుళ్లు సాయి, శశికాంత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.రోడ్డు భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమీప ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు.

## దూడ పై దాడి చేసిన చిరుత

**పోతిరెడ్డి పల్లెలో చిరుత కలకలం**



**ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/** సిరిసిల్లపోతిరెడ్డి పల్లె గ్రామంలో ఓ చిరుత దూడపై దాడి చేసి చంపి తిన్న ఘటన చోటుచేసుకుంది దీంతో గ్రామస్తులుభయాందోళనకు గురయ్యారుపోతిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన సదుల పూర్ణ అటవి శివారు ప్రాంతంలో నివసిస్తుంది తమ గుడిసెల వద్ద గేదె, దూడను కట్టేయగా తెల్లవారుజామున లేచి చూసేసరికి దూడను చిరుత చంపింది దీంతో ఆ కుటుంబం బోరున విలపించింది అదేవిధంగా చిరుత కలకలంతో గ్రామంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది వెంటనే అటవీ సిబ్బంది చిరుతను పట్టుకోవాలని అక్కడివారు కోరుతున్నారు.




## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక సంఘం డిమాండ్

**కొమరం భీం ఆసిఫాబాద్** జిల్లా సిర్పూర్(టి) మండలంలోని లోనివెల్లి, కంచరపేట్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ పరిశీలించారు.రెండు పూటల ఫోటో విధానం వల్ల పని నమోదు కాక వేతనాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. బకాయి వేతనాలు, ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- టు వీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి
- కారు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి
- ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టు ను పరామర్శించిన డిపిఆర్ఓ పి.రాజేంద్ర ప్రసాద్

**మహబూబాబాద్ జిల్లా** తొర్రూరు పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు బి ఆర్కె న్యూస్ ప్రతినిధి దురుసోజు వీరాంజనేయులు, ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు ఆయనను ఆదివారం తొర్రూరు పట్టణంలో వీరాంజనేయులు స్వగృహంలో మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్, పరమశించి ప్రమాదానికి గల కారణాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు, మహబూబాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, ఎస్పీ డాక్టర్ శబరీష్, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం పై ప్రత్యేక చర్యలు తీసుకొని మండల వారీగా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు,వార్తల సేకరణలో వివిధ ప్రదేశాలకు వెళ్ళు సమయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వెళ్లి వచ్చే క్రమంలో టూవీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్లో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు వహించాలని, వేసవి కాలంలో ఆరోగ్య నియమాలు పాటించాలని ఆయన కోరారు,డిపిఆర్ఓ వెంట జర్నలిస్టులు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, కొండ సతీష్, పోల్ రాజు, బజ్జూరి వాసు, కందికొండ కుమార్, పి.బిక్షపతి తదితరులు ఉన్నారు.





## ఉపాధి హామీ కూలీలకు 'షీ టీమ్స్' పై అవగాహన సదస్సు


**ప్రజా వాయిస్ / జైపూర్** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.ఐ.పి.యస్.(డి.ఐ.జి) ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా డిసిపి భాస్కర్. ఐ.పి.యస్. పర్యవేక్షణ లో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జి ఎస్.ఐ. ఉషారాణి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది ఈరోజు జైపూర్ మండలం ఇందారం గ్రామం లో 100 రోజుల పని (ఉపాధి హామీ పథకం) క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు షీ టీమ్స్ పనితీరు మరియు మహిళా చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షి టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న షీ టీమ్స్ పట్ల ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని, వేధింపులకు గురైతే మౌనంగా భరించకుండా షి టీమ్ పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారువేధింపులపై ఫిర్యాదు: పని ప్రదేశాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే వెంటనే 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700 కు సమాచారం అందించాలని సూచించారు,గోప్యత: ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని భరోసా ఇచ్చారు.సైబర్ నేరాలు: స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని మహిళలకు వివరించారు.ఆన్లైన్ మోసాలకు జరిగినపుడు బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.చట్టాలపై అవగాహన: బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు మరియు గృహ హింస నిరోధక చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్ మహిళా కానిస్టేబుల్ జ్యోతి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్ మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

- జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:** రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూలూరుపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. మైనార్టీ తీరని వారు వాహనాలు నడపకూడదని తెలిపారు. రోడ్డు భద్రతపై మీ కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మి నరసయ్య, తహసిల్దార్ టి శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంఈఓ బి జుంకీలాల్, ఎస్సై బి రవి, పోలీస్ సిబ్బంది తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## చేగుంటను నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- భౌగోళికంగా, వసతుల పరంగా అనుకూలమైన చేగుంట
- తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత

**ప్రజా వాయిస్, చేగుంట :** చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. భౌగోళికంగా, రవాణా సౌకర్యాల పరంగా అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్న చేగుంటను నియోజకవర్గంగా మార్చాలని కోరుతూ మండల బీజేపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చేగుంట తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేగుంట మండలం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాటు రవాణా సౌకర్యాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. వడియారం రైల్వే స్టేషన్ సమీపంలో ఉండడం, జాతీయ రహదారి ఎన్‌హెచ్–44 ద్వారా అనుసంధానం కలిగి ఉండటం, పరిశ్రమలు మరియు విద్యాసంస్థలు అభివృద్ధి చెందడం వంటి అంశాలు నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించడానికి అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, నియోజకవర్గానికి అవసరమైన ప్రభుత్వ భూమి చేగుంటలో అందుబాటులో ఉండటంతో పాటు, చుట్టుపక్కల మండలాలకు మధ్యలో ఉండటం పరిపాలన సౌలభ్యానికి దోహదపడుతుందని వివరించారు. స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు చేగుంటను నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి ఎల్లా రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చింతల భూపాల్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు కరణం గణేష్ రవికుమార్, వార్డు సభ్యులు సాయిబాబా, ఎల్లేష్, రవి, పోలంపల్లి వార్డు సభ్యుడు శేఖర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ల సేవలే కీలకం



- డిమాండ్లు నెరవేర్చాలి
- సిపిఐ

**ప్రజా వాయిస్.. వనపర్తి** జిల్లారాష్ట్ర విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల సేవలు కీలకమని, వారిని నిర్లక్ష్యం చేయటం తగదని డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. వనపర్తి ఎస్.ఈ ఆఫీస్ ఆవరణలో గత ఎనిమిది రోజులుగా ధర్నా చేస్తున్న సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ధర్నాను సందర్శించి పోరాటంలో మీ వెంట మేముంటామని కడవరకు పోరాడాలని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 19,400 మంది ఆర్టిజన్లు విద్యుత్ సంస్థలు పనిచేస్తున్నారని, అందులో వనపర్తి జిల్లాకు సంబంధించి 178 మంది 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఆర్టిజన్లను విద్యుత్ సంస్థ ఉద్యోగులుగా గుర్తించిన వారి వేతనం పెంచలేదన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారు పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఒకరూల్, ఆర్టిజన్లకు మరో రూల్ అమలు చేస్తున్నారని ఒకే సంస్థలో పనిచేస్తున్న వారికి రెండు రకాల రూల్స్ అమలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఒకే రూల్ అమలు చేయాలన్నారు. ఆర్టిజన్లు రాష్ట్ర విద్యుత్ సంస్థకు ఊపిరిని ప్రభుత్వం దీన్ని విస్మరించరాదు అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు 8 రోజులుగా వారు ఆందోళన చేస్తున్న పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కనీసం వారిని చర్చలకు కూడా పిలవడం లేదని ఆర్టిజన్లు ఎవరని సాక్షాత్తు విద్యుత్ శాఖ మంత్రి ప్రశ్నించటం బాధాకరమన్నారు. ఆర్టిజన్లు బేషరతుగా ధర్నా విరమించి విధుల్లోకి హాజరైతేనే చర్చలకు పిలుస్తామని నిబంధన పెట్టటం సరికాదన్నారు. ఆర్టిజన్లకు ఏపీ ఎస్ సి బి సర్వీసెస్ అమలు చేయాలని, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎల్పీడీసీఎల్ నెల పనిచేస్తున్న అన్ మ్యాన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని, సీనియారిటీ ఉన్న ఆర్టిజన్లను ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని, 2016 ముందు సంస్థల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, 2026 పిఆర్సి వేతన సవరణ అమలు చేయాలని, విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అందించాలన్న వారి డిమాండ్లు న్యాయసమతమన్నారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతారని జాగ్రత్తగా ఉండి ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరిపే దాకా పోరాటం ఆపవద్దని సిపిఐ అండగా ఉండి పోరాడుతుందని ధైర్యం చెప్పారు. సిపిఐ నేతలు డి శేఖర్, చిన్న కురుమయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.




## ఈదులగూడెంలో చలివేంద్రం ప్రారంభం

- స్థానికుల సేవా కార్యక్రమాన్ని అభినందించిన వన్ టౌన్ ఎస్ ఐ సైదిరెడ్డి

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ** మిర్యాలగూడ పట్టణ పరిధిలో వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు చల్లని తాగునీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సైదిరెడ్డి ప్రారంభించారు. ఈ చలివేంద్రం ద్వారా పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులకు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదిరెడ్డి మాట్లాడుతూ.. "వేసవి కాలంలో ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. స్థానికులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలవాలి. ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలి. వేసవిలో ప్రతి ఒక్కరూ ఎక్కువగా నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ప్రజల సేవే పోలీసుల బాధ్యత, ఇలాంటి సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుంది" అని తెలిపారు.చలివేంద్రం ప్రారంభంతో స్థానికులు పోలీసుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు పుట్టపాక శ్రీనివాస్,జన్నపాలా సునిత కిరణ్,అరుణ సుధాకర్,మన్నెం శ్రీనివాస్ రెడ్డి,దొంతం వెంకట్ రెడ్డి,గాయం రమణా రెడ్డి, గాయం వీరారెడ్డి, చిమట నాగయ్య యాదవ్,నడ్డి శివకృష్ణ యాదవ్,మన్నెం సైదిరెడ్డి, నంద కిషోర్, పి. శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## పీఎం శ్రీ పొతారం పాఠశాలలో 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' వేడుకలు

- తెలంగాణ, హర్యానా సంస్కృతుల సమ్మేళనం
- విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అమోఘం
- ఎంఈఓ లోకిని శ్రీనివాస్

**ప్రజా వాయిస్, కథలాపూర్**:స్థానిక పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో బుధవారం 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్నతనం నుండే భిన్నత్వంలో ఏకత్వంపై అవగాహన కల్పించేందుకు, దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయాలను గౌరవించేలా తీర్చిదిద్దేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు హర్యానా రాష్ట్ర సాంస్కృతిక నృత్యాలు, గీతాలను ప్రదర్శించి అలరించారు. అనంతరం తెలంగాణ మరియు హర్యానా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించేలా ఆహార పదార్థాలు, వేషధారణ, పండుగలు, చారిత్రక కట్టడాలు మరియు ప్రముఖుల విశేషాలను ప్రదర్శనల ద్వారా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి విజ్ఞానదాయక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలు వేర్వేరు రాష్ట్రాల సంప్రదాయాలను వివరించడం వారి మేధోవికాసానికి తోడ్పడుతుందన్నారు. సర్కారు బడుల్లో ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, పౌష్టికాహారం అందిస్తున్నామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలని కోరారు. గ్రామ సర్పంచ్ ధర్మపురి స్వప్న జలంధర్ మాట్లాడుతూ.. ఇలాంటి విభిన్న కార్యక్రమాల వల్ల పిల్లలకు పాఠశాల పట్ల ఆసక్తి పెరుగుతుందని, పాఠశాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష హరిప్రసాద్ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను విద్యార్థుల్లో పెంపొందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా స్టేషనరీ సామాగ్రిని బహుమతులుగా అందజేశారు. ఈ వేడుకలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కిషన్ రావు, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పులి హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపసర్పంచ్, ఏఏపీసీ చైర్మన్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయ బృందం, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది, గ్రామ పెద్దలు నరేందర్, వీఓఏలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ కొరత లేదు


- ఇంటి వద్దకే సరఫరా
- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** జిల్లాలో ఎల్ పి జీ వంట గ్యాస్ కొరత లేదని, ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు . బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఎల్పిజి సరఫరా మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి లతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ, పోలీస్ శాఖల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... జిల్లాలో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన వంట గ్యాస్‌ను ఇంటి వద్దకే సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్,. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత రాకుండా LPG సరఫరా కొనసాగించాలని సూచించారు. గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరగకుండా విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా స్టాక్ ను నిర్వహించడంతో పాటు అదనంగా 15 శాతం నిల్వలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు . అలాగే గ్యాస్ ఏజెన్సీలు అవసరమైన స్టాక్‌ను ముందుగానే సమకూర్చుకుని, వినియోగదారుల నిజమైన బుకింగ్‌లను కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుని ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా జరిగేలా అధికారులు కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఏం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్ , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారు (ఇంచార్జ్ ) రాజేశ్వర్ ,రవాణా శాఖ అధికారిణి అరుణ , సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, డి ఎల్ ఏం ఓ ఏం అనిల్ కుమార్ , ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీ ల ప్రతినిధులు పి.ప్రతాప్ రెడ్డి, జె.మురళీధర్ రెడ్డి, వై.వినోద్ కుమార్, పోలీస్ శాఖ అధికారులు , సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు .



## పాపన్నపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆధార్ దందా

- అక్రమంగా అండ ఆధార్ సెంటర్లో అధిక డబ్బులు వసూలు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- ఇదేమని ప్రశ్నిస్తే నీ దిక్కున్న చోట చెప్పుకో




**ప్రజా వాయిస్,పాపన్న పేట** పాపన్నపేట లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధార్ సెంటర్ వ్యక్తి అనేది 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య. ఫస్ట్ ఆధార్ కార్డ్ దించేటప్పుడు ఒక్క రూపాయి కూడా డబ్బులు చెల్లించొద్దు కానీ ఈ ఆధార్ సెంటర్ లో 200 నుంచి 500 వరకు వసూలు చేస్తున్నారు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడీఏఐ) ఈ సేకరించిన వివరాల ఆధారంగా ప్రతి వ్యక్తికి ఆధార్ జారీ చేస్తుంది. అలాంటి ఆధార్ కార్డు నమోదు లో దందా ను సాగిస్తూ నిర్వహకులు లక్షల రూపాయాలు దండుకుంటున్నారు. నిబంధనలను అతిక్రమించి ఆధార్ కార్డులో వివరాలను నమోదు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం తో నిర్వహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే ఆధార్ లో చేర్పులు ,మార్పులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో ఒక్కరి నుంచి వేల రూపాయాలు వసూళ్లు చేస్తున్నారు.

### ఆధార్ సెంటర్ అక్రమాలు

ఆధార్ సెంటర్లో. ఆధార్ కార్డులో ముఖ్యంగా పేరు నమోదు తప్పు ఒప్పులు ,జనన తేదీ నమోదు ,అడ్రస్ మార్పులు ,వేలి ముద్రల నమోదు ,ఫోటో మార్పులు చేయనున్నారు. వీటి నమోదుకు సరియగు పత్రాలు ఉంటే నే ఆన్ లైన్ ప్రక్రియ అవుతుంది. ఈ నిబంధనలతో సంబంధిత సర్టిఫికేట్లను స్కాన్ చేసి ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటి కోసం రూ. 100 నుండి 200 వరకు వసూళ్లు చేస్తున్నారు.ఆధార్ సెంటర్ల నిర్వహకులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పొందుటకు వయస్సు నిబంధన పెట్టింది

### బ్యాంకు మేనేజర్

ఇంత అక్రమాలు జరుగుతున్న బ్యాంకు మేనేజర్ మాత్రం ఏమి పట్టించుకోనట్టు వ్యవహరిస్తున్నాడు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గల ఆధార్ సెంటర్ ఎంత బాగోతం జరుగుతున్న అసలు నాకు తెలవదు అని ఆధార్ ఫాముల మీద మాత్రం సంతకాలు చేస్తున్నారు

### కలెక్టర్ మేడం మీరైనా

అవినీతిని అరికట్టరా..పాపన్నపేట లోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు లోని ఆధార్ సెంటర్ లో అక్రమ వసూళ్ల పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అడ్డు అదుపు లేకుండా జరుగుతున్న వసూళ్లపై స్థానిక అధికారులు కనీసం పట్టించుకోవటం లేదు. పాపన్నపేటలోని ఆధార్ సెంటర్ అవినీతి పై దృష్టి సారిస్తే అనేక అవినీతి అక్రమాలు బహిర్గతమవుతాయి. నిరుపేదల నుంచి ఆధార్ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు కలెక్టర్ ముక్కుతాడు వేయాలని స్థానికులు కోరుతున్నారు"

## సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలి

- లేదంటే జీఎం ఆఫీసు ముట్టడి తప్పదు!
- బెల్లంపల్లిలో టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో 'కార్మిక బాట'..
- సమస్యల సుడిగుండంలో కార్మికులు




**ప్రజా వాయిస్ /బెల్లంపల్లి** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో బుధవారం టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో "సింగరేణి కార్మిక బాట" కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు నాయకులు ఈ పర్యటన చేపట్టారు,బెల్లంపల్లి పరిధిలోని 34 సింగరేణి వార్డులకు నీటి సరఫరా, క్వార్టర్ల మరమ్మతుల కోసం కార్యాలయం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందని నాయకులు మండిపడ్డారు. ఏళ్ల క్రితం వేసిన వాటర్ పైపులైన్లు తుప్పు పట్టి, రంధ్రాలు పడటంతో నీరు వృధాగా పోతోందని దుయ్యబట్టారు. దీనిపై జేఈని వివరణ కోరగా.. పైపుల మరమ్మతుకు మెటీరియల్ లేదని, పర్మనెంట్ వెల్డర్ కూడా లేదంటూ సాకులు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు,చేయించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు 12 గంటల పాటు వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. యాజమాన్యం నుండి పూర్తి వేతనం అందుతున్నా, కాంట్రాక్టర్లు మాత్రం కార్మికులకు, డ్రైవర్లకు సరైన వేతనం చెల్లించడం లేదని ఆరోపించారు,బెల్లంపల్లిలో బొగ్గు గనులు ముగిసినందున, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి పి. మణిరామ్ సింగ్ డిమాండ్ చేశారు. ప్రస్తుత గుర్తింపు సంఘం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల పొట్ట కొడుతోందని విమర్శించారు,మందమర్రి జీఎం తక్షణమే స్పందించి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సివిల్ కార్యాలయంతో పాటు జీఎం ఆఫీసును ముట్టడిస్తామని మణిరామ్ సింగ్ హెచ్చరించారు.

## పంట చేనులో నుంచి రోడ్లు నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో'కి వినతి పత్రం అందజేత

- జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి
- డర్ర దామోదర్
- తెలంగాణ వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.



**ప్రజా వాయిస్; ములుగు జిల్లా;** వాజేడు, వెంకటాపురం మండలం./ వెంకటాపురం మండలం వి.ఆర్.కె పురం గ్రామ పంచాయతీ పరిధిలోని చొక్కాల గ్రామం నుండి గోదావరి నది వరకు ఉన్నటువంటి పంట పొలాల్లో రహదారులు లేక రైతులు పండించుకున్న పంటని మెయిన్ రోడ్డుకు తరలించాలంటే అధిక ఖర్చుల భారం రైతు మీద పడుతుందని, దానికి తోడు పంట పొలాల్లోకి కాలినడకన సుమారు అయిదు కిలోమీటర్లు నడిచి వెళ్లి రావాలంటే రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వార ప్రధాన రహదారులు వేపించాలని సంఘం తరపున ఎంపీడీవోకి వినతిపత్రం అందజేసి నాయకులు. గ్రామపంచాయతీ పరిధిలోని చొక్కాల వైన్ షాప్ నుండి గోదావరి పాయఒడ్డున ఉన్నటువంటి కొండ గొర్ల సమ్మయ్య పంట చేను వరకు సుమారు కిలోమీటర్ వరకు కంకర మొరుముతో రోడ్డు నిర్మాణం చేపట్టి, నరసింహారావు పంట చేను వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు పాలెం రోడ్డుకు కలిసేంత వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వి.ఆర్.కె. పురం సర్పంచ్ డర్ర రమ్య, వార్డు సభ్యులు భోగట పవన్, వాడ బలిజ ములుగు జిల్లా ముఖ్య సలహాదారు బద్ది ఆదినారాయణ, యువ నాయకులు కొప్పుల మల్లయ్య, రానాబోయిన దినేష్, అంగాల రమేష్, డర్ర రాంప్రసాద్, గార గోపాలకృష్ణ, గౌరారపు శ్రీను, గగ్గూరి ఏసు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు భాగ్యకు కన్నీటి వీడ్కోలు

- ఆశ్రుయానాల మధ్య అంతక్రియలు
- భారీగా తరలివచ్చిన విప్లవ అభిమానులు
- అధ్యతంగా కొనసాగిన ర్యాలీ
- ఆటపాటలతో విప్లవ కళాకారుల నివాళి
- మూడు గంటలపాటు సాగిన అంతిమయాత్ర
- అడుగు అడుగున పోలీసుల నిఘా
- హాజరైన ప్రజా సంఘాలు నేతలు
- అక్కకు తలకొరివి పట్టిన తమ్ముడు



**ప్రజా వాయిస్ మిరుదొడ్డి** చతిస్గడ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్ లో మృతి చెందిన భాగ్య అలియాస్( రూపి రెడ్డి )అంత్యక్రియలు బుధవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో అంతక్రియలు జరిగాయి. మంగళవారం రాత్రి పొద్దున తర్వాత గ్రామానికి భాగ్యమృతదేహం చేరుకుంది. కుటుంబ సభ్యుల ఇంటి వద్ద భాగ్య మృతదేహాన్ని ఉంచగా బుధవారం ఉదయం నుంచి గ్రామస్తులు ఉద్యమకారులు విప్లవ సంఘాల విప్లవ అభిమానులు ప్రజా సంఘాలు నేతలు హాజరై అంత్యక్రియలు పాల్గొన్నారు. ఆమె మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అంతక్రియలు ప్రారంభం కాగా వందలాదిమంది అభిమానుల సమక్షంలో శవయాత్ర ర్యాలీ ఎర్రజెండాలతో భారీగా నిర్వహించారు. పలువురు ఉద్యమకారుల పాటలు పాడుతూ ఆటలాడుతూ అంతక్రియలు నిర్వహించారు. తన ఇంటి నుంచి ప్రధాన కూడలి వరకు రెండు గంటలపాటు ర్యాలీ నిర్వహించారు. ఉద్యమకారులు కళాకారులు ఆటపాటలు తో అంత్యక్రియలో పాల్గొన్నారు .అనంతరం తన వ్యవసాయ భూములో భాగ్య అంత్యక్రియలు పూర్తి చేశారు.




# నిర్మల్ మున్సిపల్ 15 కోట్ల టెండర్ రద్దు పై బిజెపి కలెక్టర్ కు వినతి

**ప్రజా వాయిస్, నిర్మల్** నిర్మల్ పట్టణ అభివృద్ధికి సంబంధించి గతంలో మంజూరైన 15 కోట్ల నిధుల పనుల టెండర్లను నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిల్ లో రద్దు చేస్తాం అనడం హేయమైన చర్య అని, ఇది అభివృద్ధిని అడ్డుకునేలా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ గారికి, సంబంధిత శాఖ అదనపు కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మొన్నటికి మొన్న కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ బీజేపీ ఉనికిని కాపాడుకోవడానికే ఇలా చేస్తుందంటూ మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. వరుసగా రెండు సార్లు పార్లమెంట్ ఎన్నికలలో, ఎమ్మెల్యే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ తో భారతీయ జనతా పార్టీ గెలుపొందిన విషయం గుర్తుచేశారు. మొన్నటికి మొన్న సర్పంచ్ ఎన్నికల్లో 80 స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం 13 సీట్లు గెలుపొందామని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్థానికంగా కనీసం డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీనే జిల్లాలో తమ ఉనికి కాపాడుకునేందుకు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, పట్టణ బీజేపీ కౌన్సిలర్లు శ్రీరామోజు నరేష్, కూన శశాంక్, ముత్యం, ధర్మాజీ గారి ఈశ్వర్, విఠల్, ఖమ్మం సురేందర్ తో పాటు పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది

- పల్లెల్లో బెల్ట్ దందా
- పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు







**ప్రజా వాయిస్, పాపన్నపేట** పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, మారుమూల గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేక మంది బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధిపాలవుతున్నా:ఉమ్మడి మెదక్ జిల్లా పాపన్నపేటమండలపరిది లోని పలు పల్లెల్లో బహిరంగంగానే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. అనుమతులు పొందిన వైన్స్ షాపుల నుంచే వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు బెల్ట్ దుకాణాలకు తరలుతున్నట్లు నిఘూవర్గాలుజిల్లాపేర్కొంటున్నాయి. సంబంధిత ఎక్సైజ్‌శాఖ అనుసంధానాల్లోనూ బెల్ట్ దుకాణాల నిర్వహణకు ప్రోత్సాహం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలు, తండాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతూ ప్రజలు మత్తులో చిత్తవుతున్నా.. నిరోధించాల్సిన సంబంధితశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఒక వైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయంఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే మరోవైపు బెల్ట్‌షాపులు పల్లెప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. కానీ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది.

### జోరుగా బెల్ట్ దందా

ఉమ్మడిమెదక్ జిల్లాలోనే సుమారు 455 మద్యం షాపులున్నాయి. ఒకవైపు బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామని పోలీసులు ప్రకటిస్తుండగా.. మరోవైపు గ్రామాల్లో యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగైదు వరకు జోరుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం చూసి చూడనట్లు పోవడంలో ఇంకా బెల్ట్ షాపు యజమానుదారులు రెచ్చిపోతున్నారు . ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పచ్చని కాపురంలో చిచ్చు... గ్రామాల్లో బెల్ట్ షాపులు మొదలైనప్పటి నుంచి ఉదయం 5 గంటల నుంచి ఇంటి నుంచి బయటకు వచ్చి మద్యం సేవించి ఇంటి వద్ద తరచూ గొడవలకు దిగుతున్నారని ఆరోపణలు మమేకం వస్తున్నాయి. సంపాదించాల్సిన సమయంలో మద్యం సేవించి తరచు గొడవల బారిన పడుతూ తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని కొందరు మహిళలు తెలుపుతున్నారు. ఇకనైనా సంబంధిత ఆప్కారి శాఖ బెల్టు షాపులపై తనిఖీలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- భట్టి విక్రమార్కపులిగుండాల ప్రాజెక్ట్ పరిసరాల్లో కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు మంజూరు
- కనకగిరి హిల్స్ అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలి
- పర్యాటకుల సౌలభ్యం కోసం డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి
- బ్రాహ్మల్ల కుంట గ్రామంలో పులి గుండాల ట్యాంక్ వద్ద పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి, పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రివర్యులు పొంగులేటి



**ప్రజా వాయిస్ ఖమ్మం పెనుబల్లి** మండలం బ్రాహ్మల్ల కుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీ లను ప్రారంభించారు.డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణ లోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో టూరిజం క్రింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించిందన్నారు. అలాగే ఈ ప్రాంతానికి వెళ్లే యాక్సెస్ రోడ్డు ను డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వం ప్రారంభించి మిగిలిపోయిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఆ ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాంతానికి నీటిని తీసుకువచ్చి నిరంతర నీటి సరఫరా కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, సాధ్యమైతే ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ చెట్లు లేకుండా జీవనం సాధ్యం కాదని, మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు. మనకు అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే లభిస్తుందని, మనిషి అవసరాలకు ఉపయోగించే మంచం వంటి అనేక వస్తువులు కూడా చెట్ల నుంచే వస్తాయని తెలిపారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం, మంత్రులు ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కనకగిరి హిల్స్‌కు ఎకో టూరిజం క్రింద నిధులు, నీలాద్రి హిల్స్‌కు దేవాలయ పర్యాటక అభివృద్ధి క్రింద నిధులను డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంజూరు చేయడం జరిగిందన్నారు. మన చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని కాపాడేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.



# పోలీస్ స్టేషన్‌కు చేరిన ఓపెన్ పరీక్ష ప్రశ్నాపత్రాలు

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.**ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (TOSS) సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు బుధవారం మిర్యాలగూడ టౌన్ టూ పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పేపర్ కస్టోడియన్లు గుడిపాటి కోటయ్య, నెహ్రూల ఆధ్వర్యంలో చీఫ్ సూపర్డెంట్ మరియు డిపార్ట్మెంటల్ అధికారుల సమక్షంలో ప్రశ్నాపత్రాలను స్టేషన్‌లో డిపాజిట్ చేశారు. అనంతరం లాకప్‌కు తాళం వేసి సీలువేశారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ అధికారులు ఏలేటి వినోద్ కుమార్, బండ వెంకటరెడ్డి, అశోక్ కుమార్, కృష్ణకాంత్, వెంకన్న, అమరేందర్ రెడ్డి, కర్నాటి శ్రీనివాస్, బొడ్డు సైదులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# నిరుపయోగంగా కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తులు

**ప్రజా వాయిస్, పాపన్నపేట** మెదక్ జిల్లా పాపన్నపేటలో ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా పాపన్నపేట మండల కేంద్రంలో అభివృద్ధి అడుగుజాడలు కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం నేటికీ వినియోగంలోకి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అలాగే, కోట్లాది రూపాయలతో నిర్మించిన బస్టాండ్ ఉన్నప్పటికీ, బస్సులు ప్రాంగణంలోకి రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది.నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికార యంత్రాంగం స్పందించి, టీటీడీ కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, బస్సులను బస్టాండ్ లోపలికి నడిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ ఆస్తులు వృథా కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మురికి కాలువలు అస్థవ్యస్తం

- దోమలతో ప్రజలు ఇబ్బందులు
- చీకటి పడితే దోమలతో ప్రజలు జాగరమే
- మీరు రోజు వార్తలు రాయండి
- మేము కూడా అలాగే పని చేస్తాం
- అధికారి బెదిరింపులు..



**ప్రజా వాయిస్ టేక్మాల్ :** టేక్మాల్ గ్రామంలోని మహంకాలి వీధిలో మురికి కాలువలు అస్థవ్యస్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కాలనీలో అధికారులు మురికి కాలువల పూడిక తీత పనులు చెప్పట్టలేదు. దింతో కాలనీ లోని మురికి కాలువలో చెత్త, చెదారం, పిచ్చి మొక్కలు పెరిగి మురికి కాలువలు దుర్వసన వెదజల్లుతున్నాయని కాలనీ ప్రజలు వాపోయారు.ఇదిలా ఉంటే మురికి కాలువలను శుభ్రం చేయించాలని ఓ ఆన్లైన్ డిజిటల్ పత్రిక వచ్చిన వార్త కథనానికి గ్రామ అధికారులు విలేకరిని పరోక్షంగా బెదిరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.మీరు ఇలాగే రోజు వార్తలు రాయండి, మేము అలాగే పని చేస్తాం అని అధికారి బెదిరిస్తున్నాడు.సమస్యలపై దృష్టి సారించాల్సిన అధికారులే ఇలా విలేకరిపై బెదిరించడం, ఆలా ప్రవర్తించడం ఏంటని పలువురు అధికారిపై మండిపడుతున్నారు.ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించే విదంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ కోర్సులో చేరడానికి జిల్లాస్థాయి 'దోస్త్' సహాయ కేంద్రం ప్రారంభం

- కొప్పుల మల్లేశం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

ప్రజా వాయిస్; ములుగు జిల్లా./ డిగ్రీలో ప్రవేశానికి దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్'కు సంబంధించి ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే విద్యార్థులు కళాశాల "దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్" కు వచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు దోస్త్ రిజిస్ట్రేషన్ కూడా చేయబడుతుందని, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన గత సోమవారం డిగ్రీలో ప్రవేశానికై దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేశారని, హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభోత్సవ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..... ఈసారి దోస్త్ అడ్మిషన్లు మూడు దశల్లో ఉంటాయని, మొదటి విడత రిజిస్ట్రేషన్ కొరకు రూపాయలు 200/-, రెండవ, మూడవ విడత లో రిజిస్ట్రేషన్ కొరకు రూపాయలు 400/- ఫీజు ఆన్లైన్లో చెల్లించవలసి ఉంటుంది. డిగ్రీలో ప్రవేశానికై దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆధార్ కార్డు, ఆధార్'తో లింక్ అయిన మొబైల్ నెంబర్, కలర్ ఫోటో, టెన్త్ మెమో, ఇంటర్ మెమో లేదా హాల్ టికెట్, 6 నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఇటీవల తీసిన కుల, ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించవలసి ఉంటుందని. పూర్తి సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. (9966153683, 8978825734, 9550965334) ములుగు జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్నివినియోగించుకోవల్సిదిగా ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ జె.శంకర్, వైస్ ప్రిన్సిపాల్ బి.బాలయ్య, అకాడమీ కోఆర్డినేటర్ సిహెచ్ భాస్కర్, అధ్యాపకులు పి.ఉదయ శ్రీ, పి. విజిత, ఆర్.తేజోలత, టి. శ్రీను, ఎన్ సుమన్, టెక్నికల్ అసిస్టెంట్లు హెచ్. రమేష్, ఎస్. రమేష్, నూతనంగా అడ్మిషన్ పొందే విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

- ప్రతి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి
- పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి
- ప్రజలకు పారదర్శకంగా వేగవంతంగా సేవలు అందించాలి
- ముఖ్యంగా సన్న బియ్యం రేషన్ గృహ నిర్మాణాలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి
- ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం
- మండల సభ లు ప్రధాన లక్ష్యం



జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాప్రజా వాయిస్/జనగామ జిల్లా ప్రతినిధి బుధవారం, జనగామ జిల్లాలోని కొడకండ్ల మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తోన్న వివిధ సేవలు, దస్త్రాల నిర్వహణ, హాజరు పట్టికలు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ప్రతి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రికార్డు రూంను తనిఖీ చేసి, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ సేవల అమలు వంటి అంశాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు.కార్యాలయంలో పరిశుభ్రత చర్యలు పాటించాలని, రికార్డుల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని తెలిపారు.అనంతరం కొడకండ్ల మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈ నెల 16న జరిగే మండల సభల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమావేశం ఏర్పాటు చేసి, సమీక్షించారు.ఈ నేపథ్యంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వెంటనే పరిష్కరించేందుకు మండల సభలు ముఖ్య వేదికగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. సభను సమర్థవంతంగా నిర్వహించాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మైక్ నిర్వహణ, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా సన్నబియ్యం, రేషన్, గృహ నిర్మాణాలు, తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు.అలాగే సభల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ, అందిన ప్రతి అర్జీని నమోదు చేయాలని తెలిపారు.మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని సూచించారు.ఈ తనిఖీలో, సమావేశంలో గృహ నిర్మాణ పీడీ మాత్రు నాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఎంపిడిఓ లు నాగశేషాద్రి సూరి, వెంకటేష్, తహసీల్దార్ అనిల్ బాబు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంపోడు లో రోడ్డు ఎక్కిన అన్నదాతలు

- ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతుల నిరసన
- బస్తాకు 2 కిలోల కోతపై మండిపడ్డ రైతులు
- మౌనం వహించిన అధికారులు

ప్రజా వాయిస్: గుర్రంపోడు మండలం,నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొనడంతో అన్నదాతలు ఆగ్రహంతో రోడ్డెక్కారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని ఆరోపిస్తూ బుధవారం నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించారు.ఒకవైపు కొనుగోళ్లు ఆలస్యం అవుతుండగా, మరోవైపు బస్తాకు రెండు కిలోల కోత విధిస్తామని నిర్వాహకులు చెప్పడం రైతుల ఆగ్రహానికి మరింత కారణమైంది. దళారులు, మిల్లర్లు కుమ్మక్కై తమను దోచుకుంటున్నారని రైతులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు.సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఓ, ఎంఆర్ఓలను రైతులు నిలదీయగా వారు సరైన సమాధానం ఇవ్వలేక మౌనం వహించారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి అక్రమ కోతలను అరికట్టాలని అన్నదాతలు గట్టిగా డిమాండ్ చేశారు.ఈ నిరసనలో రైతు సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

